నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 1 ఫిబ్రవరి 2025 | VIKARABAD

# నేడు జిల్లాకు రామన్న

**కులకచర్ల మండలంలోని దాస్యానాయక్ తండాలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ**


**అనంతరం బహిరంగ సభలో మాట్లాడనున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



వికారాబాద్, జనవరి 31, (నమస్తే తెలంగాణ) : జిల్లాలో నేడు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారు. పరిగి నియోజకవర్గం కులకచర్ల మండలంలోని దాస్యానాయక్ తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించనున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడనున్నారు. కేటీఆర్ పర్యటన దృష్ట్యా విగ్రహావిష్కరణతోపాటు బహిరంగ సభకు సంబంధించి సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా కేటీఆర్‌కు పరిగి నియోజకవర్గ కేంద్రంలో ఘన స్వాగతం పలకడంతోపాటు భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డితోపాటు పరిగి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.

# మాజీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

**జ్ఞాపికను అందజేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్ కొందూటి మహేశ్వరిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

షాద్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ దంపతులు, వైస్ చైర్మన్ నటరాజ్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా సన్మానించారు. ఇటీవల మున్సిపల్ పదవీకాలం ముగిసిన సందర్భంగా శుక్రవారం తెలంగాణ భవన్‌లో చైర్మన్లు, వైస్ చైర్మన్లను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఇందులో భాగంగానే మాజీ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ మహేశ్వరి, వైస్ చైర్మన్ నటరాజ్‌ను మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కేశంపేట మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ యువనాయకుడు రవీందర్‌యాదవ్‌తో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

–షాద్‌నగర్ టౌన్, జనవరి 31

# మా భూములను కబ్జా చేస్తున్నారు..

**వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఎన్కెపల్లి గ్రామస్తులు**



మా భూములను కబ్జా చేస్తున్నారని.. వాటిని ఇప్పించాలని ఎన్కెపల్లి గ్రామస్తులు శుక్రవారం వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రాన్ని సమర్పించి..తమ గోడును చెప్పుకొన్నారు. ఎన్కెపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులు మన్నెగూడ పెంటయ్య, కంతల భీమయ్య, బుజ్జమ్మ, ఆనందం, మాలె భీమయ్య, విజేందర్, పులిందర్ తదితరులకు చెందిన సర్వేనంబర్ 115లో 19 ఎకరాల ఇనాం పట్టా భూమి ని రియల్టర్ ఆలంఖాన్, మల్లి యువరాజు, ఐదర్, సుధాకర్‌రెడ్డి కబ్జా చేసి మైరాన్ వెంచర్ పేరుతో లేఅవుట్ చేస్తున్నారని.. ఇది ఏమిటని అడిగితే రౌడీలతో చంపిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన అదనపు కలెక్టర్.. ఆర్డీవో ద్వారా విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

–పూడూరు, జనవరి 31

## అర్హులందరికీ వర్తింపజేయాలి



కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రతి ఏడాది ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పుడు ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పని చేసి ఉన్న వారికే ఆత్మీయ భరోసాను వర్తింపజేస్తామని కొర్రీలు పెట్టడం సరైంది. భూముల్లేకుండా ఉపాధి హామీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న వారు జిల్లాలో చాలామంది ఉన్నారు. వారందరికీ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందించాలి.

– బాలకృష్ణగూడ, మీర్‌ఖాన్‌పేట

## కేవలం 14,284 మందేనా..?



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులను ఎంపిక చేయడంలో అధికారులు వివక్ష చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరినీ పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలి. ఈ పథకానికి జిల్లాలో కేవలం 14,284 మందినే ఎంపిక చేయడం సరైందికాదు. పైరవీలకే ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

– బుగ్గరాములు,
సీపీఎం మండలాధ్యక్షుడు



**భరోసా భగవంతుడెరుగు..**

# గుర్తింపేదీ..?



## రంగారెడ్డి జిల్లాలో 1,83,390 మందికి జాబ్‌కార్డులు

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులు కేవలం 14,284 మందేనా..?

### అర్హుల ఎంపికలో అవకతవకలు

### పైరవీలకే అధికారులు ప్రాధాన్యమిచ్చారని ఉపాధి కూలీల ఆగ్రహం

*ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హుల ఎంపిక ప్రహసనంగా మారింది. జిల్లాలో లక్షలాది మంది అర్హులున్నా కేవలం 14,284 మందే అర్హులంటూ అధికారులు జాబితా విడుదల చేయడంపై ఉపాధి హామీ కూలీలు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో వేలాది మంది జాబ్‌కార్డులు కలిగి ఉండి కనీసం 20 రోజులకు తక్కువ కాకుండా ఉపాధి హామీ పనులకు హాజరయ్యారు. వారిలో భూమిలేని వారు ఎంతో మంది ఉన్నారు. అయితే అధికారులు కేవలం 14,284 మందిని మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఎంపిక చేయడంతో మిగిలిన వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగాయని.. అధికారులు పైరవీలకే ప్రాధాన్యమిచ్చారని ఉపాధి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.*

*- రంగారెడ్డి, జనవరి 31 (నమస్తే తెలంగాణ)*

#### 1,83,309 జాబ్‌కార్డులు..

జిల్లాలోని 21 మండలాల్లో 558 గ్రామాలున్నాయి. వాటిలో 1,83,309 జాబ్‌కార్డులున్నాయి. ఈ కార్డులు ఉన్న వారంతా ప్రతిరోజూ ఉపాధి హామీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. జాబ్‌కార్డులు కలిగిన వారి ఇండ్లలో ఉన్నవారు 3,77,087 వారు కూడా ఉపాధి పనులు చేసుకుంటున్నారు. జాబ్‌కార్డు ఉంటే ఇంట్లోని మిగిలిన వారు కూడా కూలీ పనులు చేసుకునేందుకు అర్హులు. ఈ పథకం కింద జిల్లాలో ఉపాధి హామీ పనులు చేసుకుంటున్న వారు ఎంతోమంది ఉన్నారు. ప్రజాపాలనలో భూమి లేని వ్యవసాయ కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద చాలామంది దరఖాస్తు చేసుకున్నారు.

#### అర్హుల గుర్తింపులో అవకతవకలు..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద జిల్లాలో అర్హులను గుర్తించి వారికి ఏడాదికి రూ.12,000 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమి లేని..ఉపాధి హామీ పథకంలో ఏడాదిలో కనీసం 20 రోజులపాటు పని చేసిన వారు జిల్లాలో 1,83,309 మంది ఉన్నారు. కానీ, వారిలో కేవలం 14,284 మందిని మాత్రమే ఏ విధంగా గుర్తించారనేది ప్రశ్నార్థకంగా మారింది. అర్హులను ఎంపిక చేయడంలో పైరవీలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని ప్రజలు మండిపడుతున్నారు. జిల్లాలో అర్హత కలిగిన వారందరినీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద గుర్తించాలని పలువురు కోరుతున్నారు.



# న్యూట్రిషన్ కిట్లకు రాజకీయ గ్రహణం

**కాంగ్రెస్ పార్టీ పవర్‌లోకి వచ్చిన నాటి నుంచి బంద్**



**పుట్టబోయే బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉండేందుకు.. గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన న్యూట్రిషన్ కిట్లకు రాజకీయ గ్రహణం పట్టుకున్నది. గత 13 నెలలుగా ఈ కిట్ల పంపిణీ ఆగిపోవడంతో జిల్లాలోని 9,000 మంది గర్భిణులకు సుమారు 18,000 న్యూట్రిషన్ కిట్లు అందలేదు. మహిళ గర్భం దాల్చిన నుంచి ప్రసవించే వరకు రెండు విడుతలుగా రూ.2,000 విలువ చేసే పోషకాహారాలతో కూడిన కిట్లను గత కేసీఆర్ ప్రభుత్వం గర్భిణులకు పంపిణీ చేసింది. అయితే గతేడాది కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ కిట్ల పంపిణీ నిలిచిపోవడంతో పుట్టిన బిడ్డల్లో పోషకాహార లోపం సమస్యలు వస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.**



**-వికారాబాద్, జనవరి 31**
**(నమస్తే తెలంగాణ)**

- **పౌష్టికాహారలోప సమస్యలు పెరుగుతున్నట్లు వైద్యుల వెల్లడి**
- **బీఆర్‌ఎస్ హయాంలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు న్యూట్రిషన్ కిట్లు అందజేత**
- **వికారాబాద్ జిల్లాలోని 9,000 మంది గర్భిణులకు అందని కిట్లు**

ఆరు గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్ణాల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికోసం న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర సంక్షేమ పథకాలను దేశంలోనే ఎక్కడాలేని విధంగా అమలు చేసింది. అయితే కాంగ్రెస్ సర్కార్ కొత్త పథకాలు దేవుడెరుగు...కేసీఆర్ హయాంలో అమలైన ఏ ఒక్క పథకాన్నీ అమలు చేయడంలేదు. ప్రధానంగా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా, బల వర్ధకంగా ఉండాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి రాజకీయ గ్రహణం పట్టుకున్నది. మరోవైపు కేసీఆర్ కిట్ల పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ ఎంసీహెచ్ కిట్లుగా పేరు మార్చినప్పటికీ ఆ పంపిణీని పూర్తిగా నిలిపివేసింది. మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన రేవంత్ ప్రభుత్వంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఆగిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ..

పుట్టబోయే శిశువు పూర్తి ఆరోగ్యంగా ఉండేందుకు గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన న్యూట్రిషన్ కిట్ల సరఫరా గతేడాదిగా నిలిచిపోయింది. దీంతో జిల్లాలో సుమారు 9,000 మంది గర్భిణులకు సుమారు 18,000 న్యూట్రిషన్ కిట్లు అందలేదు. అయితే మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు ఐదు, తొమ్మిది నెలల్లో రెండు విడుతలుగా రూ. 2,000 విలువ చేసే పోషకాహారాలతో కూడిన కిట్లను కేసీఆర్ ప్రభుత్వం అందజేసింది. ఆ కిట్లలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, రెండు కిలోల న్యూట్రిషన్ మిక్స్‌డ్ పౌడర్, కిలో ఖర్జూర, 500 గ్రాముల నెయ్యి, ఐరన్ సిరప్‌లు రెండు బాటిళ్లు, ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు తదితర వస్తువులు ఉండేవి. అయితే గతేడాదిగా ఈ కిట్ల పంపిణీ నిలిచిపోవడంతో పుట్టిన బిడ్డల్లో పోషకాహార లోపం సమస్యలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

### అటకెక్కిన కేసీఆర్ కిట్ల పంపిణీ..

గర్భిణులు, పుట్టబోయే శిశువుల సంరక్షణతోపాటు ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ల పథకం నిలిచిపోయిది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పథకం అటకెక్కింది. అయితే ప్రభుత్వ దవాఖానల్లో పాప జన్మిస్తే రూ.13,000, బాబు పుడితే రూ.12,000 ఆర్థిక సాయాన్ని గత ప్రభుత్వం అందజేసింది. మహిళ గర్భం దాల్చిన అనంతరం నాలుగు విడతల్లో ఈ సాయాన్ని పంపిణీ చేసింది. డెలివరీ తర్వాత శిశువు సంరక్షణ కోసం 16 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్లను అందజేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ల పథకాన్ని ఎంసీహెచ్ కిట్లుగా పేరు మార్చింది. కిట్లతోపాటు ఆర్థిక సాయాన్ని గతేడాదిగా ఇవ్వకపోవడం గమనార్హం. మరోవైపు 2017 జూన్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన కేసీఆర్ కిట్ల పథకంతో ప్రభుత్వ దవాఖానలకు గర్భిణులు క్యూ కట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో 37,176 మందికి కేసీఆర్ కిట్లు పంపిణీ చేయగా, అమ్మఒడిలో భాగంగా సుమారు రూ.30 కోట్ల వరకు ఆర్థిక సాయాన్ని అందించారు.

### మొదటి డెలివరీలో న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లు ఇచ్చారు..



బీఆర్‌ఎస్ హయాంలో కొనసాగిన పథకాలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయడం లేదు. గర్భిణులను దృష్టిలో పెట్టుకుని పంపిణీ చేసిన న్యూట్రిషన్ కిట్లు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయి. తనకు మొదటి ప్రసవం 15 మే 2023లో జరుగగ న్యూట్రిషన్ కిట్‌ను గత ప్రభుత్వం పంపిణీ చేసింది. దాంతోపాటు కేసీఆర్ కిట్, రూ.13,000 ఇచ్చి మరీ ఇంటి వద్దకు ప్రభుత్వ వాహనంలో పంపించారు. రెండో డెలివరీ 20 డిసెంబర్ 2024 న జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ కిట్టూ ఇవ్వలేదు. ప్రభుత్వ పెద్దలు స్పందించి గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయాలి.

– ఎర్ర సంగీత, రావులపల్లి, మర్పల్లి

### ఆరు నెలలైనా ఇవ్వలేదు.



ఆరు నెలలవుతున్నా ఇప్పటికీ న్యూట్రిషన్ కిట్‌ను పంపిణీ చేయలేదు. బీఆర్‌ఎస్ హయాంలో న్యూట్రిషన్ కిట్‌తోపాటు కేసీఆర్ కిట్‌నూ సకాలంలో పంపిణీ చేసేవారు. తనలాంటి వారికి న్యూట్రిషన్ కిట్లు ఇస్తే ఆరోగ్యంగా ఉంటాం. గత సర్కారు మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా కిట్లను పంపిణీ చేయాలి.

– ప్రియాంక, తొర్మామిడి, బంట్వారం

## అధికారుల గైర్హాజరు..

# కుర్చీకి వినతిపత్రం

**కొన్ని రోజులుగా అందుబాటులో ఉండని వ్యవసాయ శాఖ అధికారులు**

**నిరుపయోగంగా మారుతున్న ఆరుట్ల రైతు వేదిక**

**ఆందోళనలో అన్నదాతలు**



మంచాల, జనవరి 31 : వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతువేదికలు నేడు నిరుపయోగంగా మారుతున్నాయి. లక్షలాది రూపాయలతో ఏర్పాటైన వాటి లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలోని ఆరుట్ల రైతు వేదికలో కొన్ని రోజులుగా వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో రైతులకు తెలియడంలేదని బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పున్నం రాము పేర్కొన్నారు. రైతుల గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. కాగా శుక్రవారం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులు కూర్చునే కుర్చీకి బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్, జానీపాషా, జంగయ్య, వెంకటేశ్, శ్రీ కాంత్, రాజు, బాల్‌రాజ్, రాము, వేణులతో కలిసి రాము అందజేశారు.